ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

ముఖ్యాంశాలు

- అటవీ సరిహద్దు గ్రామాలలో వన్యప్రాణుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు అప్రమత్తం చేసే వ్యవస్థను ఏర్పాటు చేశామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.
- గల్ఫ్ దేశాల్లో ఉంటున్న ప్రవాసాంధ్రుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా ఇచ్చారు.
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి బీ.సీ. జనార్దన్ రెడ్డి తెలిపారు.
- జనగణన చేపట్టే అధికారులకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు.

==========

అటవీ సరిహద్దు గ్రామాలలో వన్యప్రాణుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు అప్రమత్తం చేసే వ్యవస్థను ఏర్పాటు చేశామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో ఈరోజు నిర్వహించిన ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొని హనుమాన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ ద్వారా అటవీ శాఖకు వాహనాలు, ప్రత్యేక అంబులెన్స్ లు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. అదే విధంగా ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని.. ఈ దిశగా అటవీశాఖను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. కుంకీ ఆపరేషన్స్ విజయవంతంగా చేపట్టి ఏనుగుల బెడదను తగ్గించామని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్ళి అక్కడ చిక్కుకున్న ప్రవాసాంధ్రులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న పలువురు ప్రవాసాంధ్రులతో మంత్రి ఈరోజు వీడియోకాల్‌లో మాట్లాడారు. ఏపీఎన్ఆర్‌టీఎస్ హెల్ప్‌లైన్ ద్వారా పూర్తి సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ వెంటే ఉంటుందని కార్మికులకు ధైర్యం చెప్పారు. ఏదైనా అత్యవసరం అయితే హెల్ప్‌లైన్ నంబర్ 85000 27678కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని మంత్రి వారికి సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

అవయవదానంలో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే ఆరో స్థానంలో నిలిచిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అపెక్స్ బాడీ అయిన నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ రాష్ట్రాల వారీగా అవయవదానం జాబితా-2025ను ప్రకటించిందని మంత్రి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన "జీవన్ దాన్" రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తోందన్నారు. గడిచిన 2 నెలల్లో అవయవదానం ద్వారా రాష్ట్రంలో 64 మందికి కొత్త జీవితం లభించిందన్నారు. విశాఖలోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు వైద్యులు విజయవంతంగా చేశారని వెల్లడించారు. అవయవదానం కోసం నిరీక్షించే 5 వేల మందిలో 50 ఏళ్ల లోపు ఉన్న వారే అత్యధికంగా ఉన్నారని మంత్రి వివరించారు.

==========

జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్యయుతంగా వార్తలను అందించాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ప్రాంతీయ, గ్రామీణ విలేకరులకు అవగాహన కల్పించేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) విజయవాడ ఆధ్వర్యంలో చిత్తూరులోని స్థానిక హోటల్లో వార్తా లాప్ మీడియా వర్క్ షాప్ ను ఈరోజు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని విలేకరులకు వార్తల పట్ల మరింత అవగాహన కల్పించడం శుభపరిణామమన్నారు.

విరామం

==========

జనగణన-2027లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సెన్సెస్ విభాగం జాయింట్ డైరెక్టర్ జగన్నాథ్ మజ్ హి అన్నారు. జనగణన చేపట్టే ప్రభుత్వ యంత్రాంగానికి అనంతపురంలోని జేఎన్టీయూ కళాశాలలో ఈరోజు శిక్షణా తరగతుల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జగన్నాథ్ జనగణన చేపట్టే అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనగణన విభాగం భారత ప్రభుత్వ అత్యంత ముఖ్యమైన పరిపాలన సంస్థల్లో ఒకటని చెప్పారు. 2027 జనగణనను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యం, కార్యాచరణ స్పష్టత, ఆచరణాత్మక అవగాహనతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా రూపొందించబడిందని తెలిపారు.

==========

ఇంటింటి సర్వేను సక్రమంగా నిర్వర్తించాలని జనగణన అధికారులకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రకాశం భవన్ లో మూడు రోజుల సెన్సస్ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందిన వారు ప్రతి ఇంటికి వెళ్ళి తప్పనిసరిగా సర్వే నిర్వహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించకూడదని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో సెన్సెస్ కార్యక్రమాన్ని

రాష్ట్ర స్థాయి నుండి ఒక ప్రత్యేక అధికారి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. డిజిటల్ విధానంలో నిర్వహించే ప్రక్రియను నిర్దేశించిన విధానంలో తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు.

==========

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీ సీ జనార్దన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం అవుకుమెట్ట ప్రాంతంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి అనుకూలమైన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తో కలిసి మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే దాదాపు 3 వేల 500 మంది లబ్ధిదారుల వివరాలు తమకు అందాయని.. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని చెప్పారు. అలాగే జుర్రెగువాగులో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న కార్పెంటర్ కాలనీ వారిని కూడా ఒప్పించి వారికి కూడా వేరే చోట స్థలాలను ఇవ్వడం జరుగుతుందన్నారు.

(వాయిస్ 31 సెకన్లు)

==========

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడమే కాకుండా వారికి స్థానిక ప్రదేశాల చరిత్ర, సంస్కృతిని తెలియజేసే గైడ్‌లుగా డ్రైవర్లను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం "గైడ్-కమ్-డ్రైవర్" పేరిట కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత కొద్ది నెలల క్రితం విశాఖ పార్ట్ నర్ షిప్ సమ్మిట్ వేదికగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, రాపిడో సంస్థ మధ్య దీనికి సంబంధించిన ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. విజయవాడలో గత ఫిబ్రవరి 24 ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రయోగించారు. ఈ ఒప్పందం ద్వారా స్థానిక డ్రైవర్లను పర్యాటక గైడ్‌లుగా విజయవాడ ఆటోనగర్ లోని పర్యాటక శాఖ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) శేషగిరిరావు, మార్కెటింగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పద్మారాణి సీలా ఆధ్వర్యంలో జరిగిన గత రెండు రోజులుగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. "గైడ్-కమ్-డ్రైవర్" శిక్షణ పూర్తి చేసుకున్న 280 మంది డ్రైవర్లను రాపిడో యాప్‌లో ప్రత్యేకంగా "టూరిస్ట్ గైడ్" అనే ఐకాన్ పేరిట అందుబాటులోకి తీసుకువచ్చారు.

==========
==========